# బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు


ఎక్లాస్‌పూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన నల్లానితండాకు చెందిన రమేష్‌నాయక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కెప్టెన్

సైదాపూర్, నవంబర్26: బీఆర్ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం మండలంలోని అమ్మనగుర్తి, బొమ్మకల్, ఎక్లాస్‌పూర్, దుద్దనపల్లి గ్రామాల్లో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం తెలంగాణ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన కొనసాగిస్తున్నదన్నారు. తెలంగాణ రాకముందు ఎట్లా ఉన్నదో ఇప్పుడు తెలంగాణ ఎట్ల ఉన్నదో ప్రజలందరికీ తెలుసన్నారు. బీఆర్ఎస్ ప్రజల పార్టీ అని పేర్కొన్నారు. కరెంటు కోతలు లేని తెలంగాణను మనం ఇప్పుడు చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ వాళ్లు 3 గంటల కరెంటు అంటున్నారు.. మూడు గంటల కరెంటుతో వ్యవసాయం సాధ్యమవుతుందా రైతులు ఆలోచించాలన్నారు. రైతులకు ఉచితంగా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు అనవసరపు మాటలు మాట్లాడుతున్నాయన్నారు. బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజల సంక్షేమమే ముఖ్యమన్నారు.

**సతీశ్‌కుమార్‌ను గెలిపించాలి :**

**డాక్టర్ బోయినపల్లి ప్రతీక్**

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్‌ను గెలిపించాలని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కుమారుడు డాక్టర్ బోయినపల్లి ప్రతీక్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో కెప్టెన్ లక్ష్మీకాంతారావుతో కలిసి కార్యకర్తల సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలంతా పాటుపడాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కారుగుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు.

**బీఆర్ఎస్‌లో చేరిక**

నల్లానితండాకు చెందిన రమేశ్‌నాయక్‌తో పాటు పలువురు రాయికల్‌తండా సర్పంచ్ బర్మావత్ అక్షయా శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి కెప్టెన్ లక్ష్మీకాంతారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్లు కొత్త తిరుపతిరెడ్డి, బిల్ల వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య, వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండ గణేశ్, సర్పంచులు చిట్టి ప్రత్యూష, కొత్త రాజిరెడ్డి, తాటిపల్లి యుగేంధర్‌రెడ్డి, ఎంపీటీసీ ఏరుకొండ ఇందిరాసుధీర్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు బర్మావత్ శంకర్‌నాయక్, పోతిరెడ్డి హరీశ్‌రావు, ఎల్కపల్లి రవీందర్, బత్తుల లక్ష్మీనారాయణ, చిక్కుల సంపత్, సర్జన ఎల్లయ్య, గోనెల శ్రీనివాస, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, నారాయణరెడ్డి, నారాయణ, మురళానాయక్, తదితరులు ఉన్నారు.

## గ్రామాల్లో ముమ్మర ప్రచారం


దుద్దనపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సైదాపూర్, నవంబర్26: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కారుగుర్తుకు ఓటేయాలని కోరారు. గ్రామాలవారీగా హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులు, ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య, దుద్దనపల్లి సర్పంచ్ తాటిపల్లి యుగేంధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ పోతిరెడ్డి హరీశ్‌రావు, నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

## ఇంటింటా బీఆర్ఎస్ ప్రచారం


ఉల్లంపల్లిలో కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎంపీపీ, మహిళా నాయకులు

చిగురుమామిడి, నవంబర్ 26: హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్‌కు మద్దతుగా ఎంపీపీ కొత్త వినీత, బీఆర్ఎస్ మహిళా నాయకులు ఆదివారం వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మండలంలోని సీతారాంపూర్, గునుకులపల్లె, ఉల్లంపల్లి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నియోజకవర్గంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ చేసిన అభివృద్ధి, మ్యానిఫెస్టో అంశాలను ఓటర్లకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి మూడోసారి సతీశ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. వీరి వెంట మాజీ ఎంపీపీలు అందె సుజాత, ఆకవరం భవాని, మహిళా నాయకులు గొల్లపల్లి అరుణ, కరివేద పద్మ, చెప్యాల మమత, ముక్కెర పద్మ, గ్రామ శాఖ అధ్యక్షులు శ్యామకూర సంపత్ రెడ్డి, సన్నిల మల్లేశం, రావుల వెంకటయ్య, మండల నాయకుడు కరివేద మహేందర్ రెడ్డి తదితరులున్నారు.


దండేపల్లిలో నినదిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్


దండేపల్లిలో సమావేశానికి హాజరైన ప్రజలు

# అభివృద్ధి చేశా.. మళ్లీ ఆశీర్వదించండి

- 3గంటల కరెంట్‌తో రైతులకు నష్టం
- కరెంట్, నీళ్లు ఇచ్చాం... పంటలు కొంటున్నాం
- అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయాలి
- ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

ఎల్కతుర్తి, నవంబర్ 26 : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందుతాయని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని దండేపల్లి, పొలాడిపల్లి, కేశవాపూర్, ఎల్కతుర్తి గ్రామాల్లో జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు కోలాటాలు, బతుకమ్మలు, డప్పుచప్పుళ్లతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే ఎన్నో పైరవీలు చేసేవారని, ఇప్పుడు ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఒకప్పుడు కరువు, కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో రైతన్నలు నేడు 24గంటల కరెంట్, సాగునీటితో ఆనందంగా పంటలు పండించుకుంటున్నారని, పండిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నదని చెప్పారు. గత ప్రభుత్వాల పాలనను ప్రజలు చూశారని, బీఆర్ఎస్ ప్రాలనను బేరీజు వేసుకొని ప్రజలు నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మవద్దని సూచించారు.

**కాంగ్రెస్ తాత్సారంతో బలిదానాలు**

**-జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్**

ప్రత్యేక తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ అలుపెరగని ఉద్యమాలు చేశారని, కానీ కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకుండా తాత్సారం చేయడంతోనే అనేక మంది బలిదానాలు చేసుకున్నారని జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ అన్ని విధాలా అభివృద్ధి చేసి, దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపారని, హుస్నాబాద్ నియోజకవర్గాన్ని కూడా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఆదర్శంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ప్రజలు పనిచేసే ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

**బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు**

మండలంలోని దండేపల్లి, కేశవాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సూరారం నుంచి 100మంది ముదిరాజ్ కులస్తులు, కేశవాపూర్ నుంచి 50మంది, దండేపల్లి నుంచి 20మంది, ఆరెపల్లి నుంచి 15మంది బీఆర్ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువా కప్పి ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

## చిగురుమామిడిలో..


ముల్కనూరులో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే తనయుడు వొడితల ఇంద్రనీల్

చిగురుమామిడి, నవంబర్ 26: మండలంలోని వివిధ గ్రామాల్లో హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ తరపున ఆయన తనయుడు ఇంద్రనీల్ ఆదివారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని ముల్కనూర్, చిగురుమామిడి, రేకొండ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి, తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను మూడోసారి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు

**-కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్**

సిద్దిపేట అర్బన్, నవంబర్ 26 : ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్లకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ గురించి జిల్లా మాస్టర్ ట్రైనర్ ప్రధాన అధికారి అయోధ్య రెడ్డి బృందం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. పట్టణ శివారులోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లాలోని 4 నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు బ్లాక్‌లను సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సెక్టార్ అధికారులుగా నియమితులైన అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్వో లు గరిమా అగర్వాల్, బెన్ షాలం, ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్ పాల్గొన్నారు.

## రసమయికి మద్దతుగా ప్రచారం

బెజ్జంకి, నవంబర్ 26 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ లింగాల నిర్మల, జడ్పీటీసీ కవిత కోరారు. మండలంలోని గాగిల్లాపూర్‌లో ఆదివారం రసమయి బాలకిషన్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు ఇం టింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి మూడోసారి రసమయి బాలకిషన్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గాగిల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎంపీపీ నిర్మల, జడ్పీటీసీ కవిత